
Reg. No. M. 2580.
To,
M. R. Ry.,

సం॥రం చందా రు. 4-0-




నెల్లూరుజిల్లా జమీందారీ రైతు సంఘ పక్షమున ప్రకటింపబడు వారపత్రిక.

సంపుటము॥ ౧. శనివారము 22-8-1931 నెల్లూరు. సంచిక ౨౦.

# వెంకటగిరి సంస్థానమునకు అప్పు నిరాకరింపబడుట.

**తణఖా పెట్టుఆస్తి చాలదని చిత్తూరు జిల్లా జడ్జి తీర్పు.**

వెంకటగిరి మహారాజాగారు మూడు లక్షల రూపాయిలు అప్పుకావలయునని తిరుమల, తిరుపతి వగయిరా దేవస్థానముల ట్రస్టీగారగు శ్రీ మహంతు ప్రయాగదాస్‌జీ వారికి వ్రాసి, ఇందుకు ఆడుమానముగా మద్రాసు మౌంటురోడ్డులోనుండు టాకర్ అందు నున్నవారి కట్టడములనున్నూ, కాళహస్తి యిలాకాలో కొన్ని గ్రామాదులనున్నూ ఆడుమానముంచులాగునను 100 కి సంవత్సరకు రు 8-0-0 లు వడ్డీ యిచ్చులాగునను తెలిపి వ్రాసిరి. అందుపై ట్రస్టీగారగు శ్రీ మహంతుగారు, ప్రీవీ కౌన్సిలు స్కీము ననుసరించి చిత్తూరు జిల్లా కోర్టులో కోర్టువారి అనుమతి కోరుచు పిటీషన్ దాఖలు చేసిరి. ఈ ఆగష్టు తే 10 ది దేవాదాయ బోర్డువారు సామాన్య ఆక్షేపణలను తమ అడ్వొకేటు ద్వారా దాఖలు చేసి కోర్టువారికి యుక్తమని తోచిన యెడల పైకము అప్పుగా యివ్వవచ్చుననిరి. తిరుపతి వాస్తవ్యులు యం. శ్రీనివాసాచార్లు తానుఒక భక్తుడననిన్ని దేవాలయ పరిపాలనములో శ్రద్ధకలిగిన వాడననిన్ని తీవ్రమైన వాదములతో కలసిన ఆక్షేపణలను దాఖలు చేయించిరి. విచారణ ప్రారంభమున మహంతుగారి వక్కీలు సి. దొరస్వామయ్యంగారువారు వెంకటగిరి మహారాజాగారికి విశేష సొత్తులున్నవనియు మూడు లక్షలు అప్పు ఇవ్వవచ్చుననియు, ఇచ్చుటలో దేవస్థానమునకు లోటురాదనియు తెలిపిరి.

దేవాదాయ బోర్డు తరపున యం. అనంతశయనం అయ్యంగారువారు ఆడుమానము వుంచులాగు తెలుపు సొత్తులు మహారాజాగారి కుమారులకు చేరినవనిన్ని, గ్రామాదులమీద మొదటిచార్జి డిక్రీలు కొన్ని యున్నవనిన్ని, టాకరు అందు నున్నవారి కట్టడములను మహారాజాగారు మూడులక్షల తొమ్మిది వేలకు కొనిరనియు, గ్రామాదులు ఒకలక్ష యాబది వేలకు కొనబడెననియు, తీయు అప్పునకు రెండింతలు సొత్తులు ఆడుమానం వుంచవలయుననియు వాదించిరి. యం. శ్రీనివాసాచార్లు తరఫున టి. యస్. నరసింహాచార్లుగారు దేవస్థానం ఖజానాలో ఇపుడు సుమారు యేబదివేలు రొఖంగా వున్నదనియు, గవర్నమెంటు పత్రములను అమ్మి ఇచ్చుటవలన దేవస్థానమునకు లాభము లేదనిన్ని ఒక పత్రమును అమ్మి మరొక పత్రముమీద పైకం అప్పుగా ఇవ్వకూడదనిన్ని వాదించిరి. హైకోర్టు జడ్జీగాయుండిన వెంకట సుబ్బారావుగారు 1930 సంవత్సరములో మరొకరు మైనర్ల విషయమై తెచ్చిన పిటీషను పై గవర్నమెంటు పత్రమును గూర్చి వ్యక్తులకు ఆడుమానము మీద ఇచ్చుట నష్టమనియు లాభకారి కాదనియు వ్యవహారములు మొదలగునవి బయలుదేరుననియు తెలిపిన జడ్జిమెంటుకు నకలును దాఖలు చేసిరి. ఆడుమానం వుంచులాగు తెలిపిన గ్రామాదుల కొన్నింటిపై యుండు మొదటిచార్జీ జీవనాంశపు డిక్రీలను దావాలనుకూడ దాఖలు చేసిరి. మదరాసులో ఒక గొప్ప వ్యక్తి 1929 సంవత్సరములో అప్పు కావలయునని కోరినందుపై అప్పట్లో జడ్జీగా యుండిన వారు మదరాసు ఇండ్లపై ఆడుమానముమీద అప్పు ఇచ్చుట మేలుకాదని తలచి, ఉత్తర్వు ఇవ్వలేదనిరి. శ్రీమాన్ దొరస్వామయ్యంగారువారు వెంకటగిరి మహారాజాగారు గొప్ప వ్యక్తిఅనియు చిత్తూరుజిల్లాకు ప్రక్కనుండు వారనియు, మహారాజాగారున్ను వారి కుమారులు అందరున్నూ కలసి, ఆడుమానము వుంచెదరనియు వడ్డీ రు 8-0-0 ల నుండి రు 8-8-0 లకు హెచ్చించిరనియు, మహారాజాగారికి యిచ్చుటలో లోటురాదనియు మరల తెలిపిరి. కోర్టువారికి యుక్తమని తోచు ప్రకారము ఉత్తర్వు చేయవచ్చుననియు మహంతుగారికి విశేష అవశ్యకతలు లేవనియు తెలిపిరి.

ఈ ఆగష్టునెల తే 13 ది చిత్తూరుజిల్లా జడ్జీగారు తీర్పుచెప్పుచూ, వెంకటగిరి మహారాజాగారు మూడు లక్షల అప్పుకోరుచు అందుకుగాను ఆడుమానం (తణఖా) పెట్టదలచుకొన్న ఆస్తి చాల స్వల్పమైనదని చెప్పుచు మహంతు పిటీషను త్రోసిచేసి వెంకటగిరివారికి అప్పు యివ్వరాదని కోర్టువారు తీర్మానించిరి.

## నెల్లూరుజిల్లా జమీందారీ రైతులు.

(ఒక విలేఖరి.)

రంగనాయకుల విచారణ సంఘము.

అల్లూరులో 14-5-31 తేదిన శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారి అధ్యక్షతక్రింద జరిగిన "నెల్లూరుజిల్లా రైతుల మహాసభ" లో నెల్లూరుజిల్లా జమీందారీ రైతుల కష్టములనుగూర్చి విచారించుటకు, ప్రొఫెసర్ గోగినేని రంగనాయకులు, పెళ్లేటి వెంకటసుబ్బారెడ్డి, బి. పెరుమాళ్లనాయుడు, మేనకూరు శీతారామిరెడ్డిగార్లు నొక కమిటీగా వేసిరి. యీ కమిటీకి రంగనాయకులుగారు అధ్యక్షులు.

పై తీర్మానము ప్రకారము నెల్లూరు జిల్లా అంతట సంచారముచేసి, జమీందారీరైతుల ఆర్థిక పరిస్థితులు విచారించుటకు రంగనాయకులుగారు 28-7-31 తేదిన నెల్లూరికి విచ్చేసిరి. మేనకూరు శీతారామిరెడ్డిగారును, రంగనాయకులుగారును 29-7-1931 తేది వేకువన నెల్లూరునుండి మోటారు కారులో బయలుదేరి వుదయము 6 గంటలకు వెంకటగిరి జమీందారీ యిలాకా మనుబోలు గ్రామమునకు వెళ్లిరి. వీరితోగూడ జిల్లా జమీందారీరైతు సంఘ సెక్రటరి నెల్లూరు వెంకట్రామానాయుడుగారుగూడ నుండిరి.

మనుబోలులో చిట్టమూరు వెంకటసుబ్బారెడ్డిగారు వగైరాలును విచారించిరి. అచ్చటనుండి మధ్యాహ్నము బైలుదేరి ఓజిలిగ్రామమునకు పోయి అచ్చట కొంత సంజాయిషీ తీసుకొని నాయుడుపేటలో దివాజీలోటకుపోయి, అచ్చట పెళ్లకూరు కోదండరామిరెడ్డిగారి సాక్ష్యము తీసుకొనిరి. అచ్చటనుండి బైలుదేరి చేనిగుంటకుపోయి కొందరు రైతులను విచారించిరి. గ్రిద్దగుంట, తడఖండ్రిగ, రైతులనుగూడ విచారించిరి. సాయంత్రం 7 గం॥లకు చేనిగుంటలో బైలుదేరి ఆ రాత్రి గూడూరు చేరిరి.

జూలై 30 తేది మధ్యాహ్నము, గూడూరునుండి బైలుదేరి, వెంకటగిరి డివిజన్‌లోచేరిన అలిమిలి, మరియొకపల్లె, జయంపు, యాచవరము, వెంగమాంబాపురము రైతులను విచారించి ఆ రాత్రి వెంకటగిరి చేరిరి.

జూలై 31 తేది ఉదయము, కటికనేని కల్యాణరావు, వెంకట్రామారావుగార్లతో కమిటీవారు బైలుదేరి, మాటుమడుగు గ్రామము వెళ్లిరి. అచ్చటి రైతులను విచారించి, అచ్చటి స్కూలును తనిఖీచేసి రైతులు మిక్కిలి బాధపడుటచే ఆ గ్రామ చెరువుయొక్క దుస్థితిని చూచి తిరుగా మధ్యాహ్నమునకు, వెంకటగిరి చేరిరి. మధ్యాహ్నమునుండి పై కమిటీ కటికనేని సోదరులతో కలిసి అత్తివరము గ్రామము వెళ్లిరి. అచ్చట రెండు పార్టీల వారిని విచారించిరి. ఈ గ్రామస్థుల కష్టములగూర్చి వర్ణించుటకు తరముగాదు. అచ్చట విచారణ పూర్తి చేసుకొని గ్రామస్థుల ప్రార్థనపై తమ చెరువు 7 చోట్ల గండ్లు బడియున్నవనియు తప్పక చూడవలసినదని కోరుటచే చెరువు చూచుకొని ఆ రాత్రి తిరుగా వెంకటగిరి వచ్చిరి.

ఆగస్టు 1 తేది వుదయము మోటారులో బైలుదేరి చాపలపల్లె రైతులు కోరియుంటచే ఆ గ్రామమునకు వెళ్లి ఆ రైతులను విచారించి, వారి చెరువు దుస్థితిగూడ చూచి, నాగనోలు గ్రామమువచ్చి మధ్యాహ్నమునకు తిరుగా వెంకటగిరికి వచ్చిరి. చుట్టుపక్కల గ్రామాదులనుండి విచారణ వగయిరాల నిమిత్తమరుదెంచియున్న రైతులను విచారణ సలిపిరి. కమిటీ సభ్యులగు పెరుమాళ్లనాయుడుగూడా ఆ రోజు వెంకటగిరికి వచ్చి విచారణలో పాల్గొనిరి. ఆ రాత్రి వెంకటగిరినుండి వెడలిపోయిరి. యీ దఫా యింతటితో విచారణ ముగిసెను.

---

## జమీందారీరైతుల ఆర్థికవిచారణ

### రంగనాయకులగారి కమిటీ సమావేశము.

28 గ్రామముల రైతుల తిరుగుబాటు—

వేటలలో సంస్థానంవారిజులుము.

(ఒక ప్రత్యేకవిలేఖరి.)

నెల్లూరు జిల్లా వెంకటగిరి డివిజన్ లోని అలిమిలి అంబలపూడి, జయంపు, యాచవరం, వెంగమాంబాపురం, మాటుమడుగు, అత్తివరం గ్రామములలో జూలై తే 30, 31 దిలయందు పై కమిటీ అగ్రాసనాధిపతియైన ప్రొఫెసర్ రంగనాయకులుగారును, సభ్యులైన మేనకూరు సీతారామిరెడ్డిగారును, జమీందారీరైతు సంఘపు సెక్రటరీగారైన నెల్లూరు వెంకట్రామానాయుడుగారును సంచారముసలిపిరి. వెంకట్రామానాయుడుగారు సాక్షులకు సహాయ మొనర్చిరి. పై గ్రామములలో రంగనాయకులుగారు, పాఠశాలలను, గ్రామ కచ్చేరీలను సందర్శించి, పుస్తక భాండాగారములు స్థాపింపవలసినట్లును, బాలికా బాలురను పాఠశాలలకు బంపునట్లును, గ్రామ పంచాయతీలను స్థాపించునట్లును, వార్తా పత్రికలను జదువవలసినట్లును గ్రామస్థుల కుపన్యాసమొనర్చిరి. హరికథలు, పురాణ కాలక్షేపములు జరిపించుట ద్వారా పెద్దవారికూడా విద్య పరపవలసినది ముఖ్యమని వారు నొక్కిచెప్పిరి. మేనకూరు సీతారామరెడ్డిగారు, రైతులు ప్రత్తి పండించి, రాట్నములు పెట్టి, నూలువడకి, వస్త్రములు తయారుచేసి ఆ గుడ్డలనే కట్టవలసినదిగా ప్రబోధ మొనర్చిరి. జమీందారీ రైతులను సంఘముగా ఏర్పడుటచే కలుగు లాభములను గురించియు, జమీందారులకు రైతులకు మధ్య నుండవలసిన సంబంధములగూర్చియు వెంకట్రామానాయుడుగారు విపులముగా చెప్పిరి. అసహాయోద్యమమునందు శ్రీకృష్ణ జన్మస్థానమలంకరించిన కటికనేని సోదరులు తే 31-7-31 దిని యీ కమిటీవారితో సంచారమొనర్చి, రైతుల కష్టములు నివారణయై వారు లాభములు పడయుటకే సంఘముగా ఏర్పడవలెనని చెప్పిరి.

### విచారణలోని కొన్నివిషయములు.

వెంకటగిరి డివిజనులో కోరు ధాన్యపు పద్ధతిపై శిస్తులు వసూలు చేయబడుచున్నవి. పండిన ధాన్యములో 1/4 లేక 1/3 భాగము వసూలు చేయబడునని తెలియుచున్నదేమో అట్లుకాక పంటతో సంబంధములేక యకరమునకు పుట్టిలో 1/4 భాగము లేక 1/3 భాగము తరముల

నిరుపయోగించి వసూలు చేయుచుండుట కమిటీవారి సాక్ష్యములో తేలినది. ఈ కోయ ధాన్యపు పద్ధతిలో శిస్తు వసూలు చేయు పద్ధతియే యిప్పటి కనబడుట లేదు. నష్టములు లేక పంటలు పండకపోయినను ధాన్యపు విలువ ప్రకారము రొఖశిస్తు చెల్లించవలసినదే.

### రైతుల తిరుగుబాటు.

దాదాపు 8 సంవత్సరముల క్రిందట కోయ ధాన్యపు శిస్తులు తగ్గించుటయును, పంటలు పండని సంవత్సరములలో శిస్తు మినహా యిచ్చుటయును కోరు రు 28 గురు మాల రైతులు ఆందోళన ప్రారంభించి కోర్టు వ్యాజ్యములను తెచ్చిరి. ఈ విధముగను చాల కష్టనష్టములైన తరువాత రైతు కోరిన విషయములలో కొన్నిటికి యెస్టేటువారు సమ్మతించి ధాన్యపు శిస్తులను కొంత తగ్గించుటకు ఒప్పుకొనిరి. అయితే జమీందారులు బలవంతులగుటచే రైతుకు అనుకూలములు లభించలేదు. 1336 వ ఫసలీలో శిస్తు మాఫీ రాలు యిచ్చెదమని వారు చెప్పి తరువాత రైతులలో బలవంతులగువారికి చిక్కులు కల్పించి వారిని తమ స్వాధీనము చేసికొని గత రెండు సంవత్సరములనుండి ప్రాత రేట్ల ప్రకారము యిప్పుడు శిస్తులు వసూలు చేయుచున్నారు. అట్లు చెల్లించని వారిపై దావాలు వేయుచున్నారు.

### వ్యవసాయాభివృద్ధులపై సిస్తులు.

తోట భూములలో పైరు పెట్టినందుకు ఈ గ్రామములలో హెచ్చు శిస్తులు విధించుచున్నట్లు ఈ కమిటీవారి విచారణలో తేలినది. సర్కారు గ్రామములలో నిమ్మ చెట్లు కాని, తమలపాకుల తోటలు కాని మామూలు మెట్ట శిస్తు విధించుచుండగా అవే పైరులకు జమీందారీ గ్రామములలో విపరీత శిస్తులు విధించుచున్నారు. మొఖాసు అను గ్రామములో యకరము తమలపాకుల తోటకు రు 64 లు విధించుచున్నారు. దీనికితోడు రైతు తమలపాకు తోటకు చెరువు నీరు పారించుకొనునేని, యెస్టేటువారి ఉత్తరువులు ముందుగా పొందియున్ననే తప్ప మరింత శిస్తును విధించుచున్నారు. ఈ విధముగా జమీందారీ రైతులు తమ భూములకు ఏ విధమైన అభివృద్ధియు చేయుటకు వీలులేనట్లు రైతుకు నిరుత్సాహము కలిగించుచున్నారు.

### న్యాయ విరుద్ధమైన శిస్తులు.

ఎస్టేటు ల్యాండు ఆక్టు ప్రకారము ఏవిధమైన ఉపరి శిస్తులు విధించుటకు జమీందారుకు వసతి లేకున్నను, మాటుమడుగు అను గ్రామములలో దేవస్థానముకు "శివుడి గునుము" వసూలు చేయబడుచున్నది. దీనికన్నను అన్యాయమైనది మరియొకటి కలదు. ప్రాత రేట్ల ప్రకారము కోయ ధాన్యపు శిస్తును వారు కోరు తప్పుడు రొఖ శిస్తుకు మార్చుటకు వీలగునట్లు పట్టాలలో పరస్పరమే పట్టాలిచ్చుచున్నారు. ప్రాత రేటు ప్రకారము కాక క్రొత్త రేట్ల ప్రకారము ఒప్పుకొనుచు కొందరు రైతులు పట్టాలను పుచ్చుకొనుచున్నారు. కొందరు తీసుకొనునట్లు బలవంతపెట్టుచున్నారు.

### వేట షికారియందు జులుము.

వేట షికారి మహారాజాగారికిని వారి అతిథులకును సంతోషమును కలుగ జేయుచుండగా రైతులకు దుఃఖము కలిగించునదై యున్నది. నవంబరు మొదలు ఫిబ్రవరి వరకు వెంకటగిరి డివిజనులో షికారీ రోజులై యున్నది. ఆ వేళలలో అడవులలో గడ్డి పట్టు కొనాలగుటచే, పశువులు తోలు కొనాలై యుండగా అడవులు మక్ఫూలు చేయబడుటచే, ఈ కాలములో రైతులు చాలా చిక్కుల పాలగుచున్నారు. వారు కంచెలకు శిస్తులు చెల్లించియుండియు పశువులను మేపుకొనుటకు హక్కులేనివారై యున్నారు. పశువులను మేపుకొనుటకు లేకపోగా వీరికి మరియొక చిక్కు కలదు. వేట షికారి ఏర్పాటుచేయబడునప్పుడు, రైతులందరు హాజరై వేట మృగములను పలువ తోలవలసినవారై యున్నారు. ఈ పలువలు తోలుటలో ప్రమాదవశమున కొందరు చనిపోవుటయు తటస్థించవచ్చును. అట్లు భయమున్నను, సంస్థానపు వారికి ఆగ్రహము వచ్చునను కారణమున, ఏమియు చేయజాలక ఊరకుండవలసిన వారగుచున్నారు. పలువ తోలుటకు ఏ రైతైనను రాకుండునో అతను బాధలకు లోను కావలసినవాడగుచున్నాడు.

### యాలంలో పెరిగే కంచె పుల్లరి.

ఈ గ్రామములో సమీపములో వుండే కంచెలలో మేపు కొనుటకు రైతులు భరించరాని పుల్లరిని కట్టవలసి వచ్చుచున్నది. ఒకప్పుడు యీ పుల్లరి చాలా తక్కువగా వుండినది. కానీ ప్రస్తుత మహారాజా గారి హయాములో అనుదినం మారే దివానుల క్రింద యీ పుల్లరి మొత్తం చెప్పతరంగాకుండ పెరిగి పోయినది. అందువల్లనే పూర్వము రు 200 లు పుల్లరి కట్టుచుండిన గ్రామం యిప్పుడు సాలుకు రు 800 లు కట్టుచున్నది. రైతులకు అడిగిన పుల్లరిని చెల్లించుట తప్ప వేరు గంతవ్యము లేదు. పుల్లరి కట్టనిచో వారి పశువులను మామూలుగా బందెల దొడ్డికి కొట్టబడి కృతయ పూర్వంగా చాలా బాధలకు పాల్జేయుచున్నారు. వీరి బాధలు యింతటితో ఆగుటలేదు. ఉదాహరణముగా యిది పరికింపుడు.

ఆ ప్రకారం రైతులు యీ హెచ్చించబడిన రు 800 లు కట్టుటకు సమ్మతించని మాత్రముననే సివిల్ కోర్టు దావాలలోకి దించబడినారు. సంస్థానమువారి అజ్ఞలేక వారి కంచెలలోకి పశువుల తోలినను నేరము వారిపై మోపబడినది. ఇట్లు రెండు సంవత్సరములు వ్యవహారము జరిగిన తరువాత రైతులు అణచివేయబడి యీ పెద్ద పుల్లరి మొత్తమునకు సమ్మతించునట్లు చేసిరి. సంస్థానము దీనితో తృప్తిచెందక గ్రామ కంచెను 3 భాగములుగా భాగించి గ్రామస్థుల కొక భాగమును మాత్రమొసంగిరి.

(సశేషము.)

## నమ్ము, నమ్మకపో.

శ్యాక్సనీ యేలిన అగస్టు అను చక్రవర్తి ప్రధాన మంత్రిగానుండిన హెన్రిక్ గ్రాఫ్‌వాన్ బ్రూహాల్ చేసినదుస్తులు వేరుండా 32 సంవత్సరములు ఆపాదమస్తకము దుస్తుల ప్రతిదినము మార్చుచుండినాడు. 12 కుట్రపువాండ్రు సదా యితని పనిలోనుండి 12000 సూటుల కుట్టిరి. వీటికి రు. 165,00,000 పట్టినది.

♦ ♦ ♦

బ్రెజిల్ లో చాకలేటు వర్ణముగల ఒక సీతాకోక జాతి పురుగులున్నవి. వర్ణమునకు దగినట్లు చాకొలెట్ వాసనే కొట్టును.

♦ ♦ ♦

జె. ఇ. హార్ గ్రీవ్సు అను ఒక ఇంగ్లీషు వ్యాపారి పూర్వము అట్లాంటిక్ మహాసముద్రమును 326 మారులు దాటినాడు.

♦ ♦ ♦

'టర్కీ-కోడి' పేరు చాలా తారుమారై యున్నది. అనుకొన్నట్లు దీని జన్మస్థానం అమెరికాగాని టర్కీ-గాదు. టర్కీ దేశములో దీనిని 'అమెరికా పక్షి' అంటారు, జర్మనీలో 'ఇండియాసీర్' అంటారు. ఫ్రాంసులో "పౌల్ ద ఇండ్" అంటారు.

♦ ♦ ♦

వలాద్ IV అనురాజు ఒకే సమయమున 10000 మంది స్త్రీ పురుష శిశువుల అవయవముల నన్నిటిని నరికించి ఆ బొబ్బరింతల మధ్య ఖులాసాగా ఒక గొప్పవిందు ఆరగించినాడు.

♦ ♦ ♦

టల్‌సాలో పుట్టుచున్న కంగోరా ఉక్కకు ముందు కాళ్లు లేవు. గాని కంగోరా మాదిరి ఎగిరిపోవుచూ జీవయాత్ర గడుపును.

జమీందారీ రైతు

1931 ఆగస్టు నెల కే 22 ది.

శనివారము.

## పునర్జన్మ.

రాజ దృష్టి దోషం దుర్నివారము అంటారు పెద్దలు. రాజుల విశాల వీక్షణములకు గురి అయిన మా జమీందారీ రైతుకు శాలారిష్టములు కొట్టినవనిన విశేషమేమియు లేదు. అటుపై మాకు గలిగిన విరోధములకు మితిలేదు. ఎట్టకేలకు పెద్దల ఆశీర్వచనముల చేతను, నెరవేర్పవలచుకొన్న ఆశయములు మహోదాత్తములగు కృషికుని సుఖజీవనములగుటచేతను, యింతకూ మా బిడ్డ ఆయుస్సు గట్టిదగుట చేతను, హిందూ ధర్మానుగుణ్యముగ పునర్జన్మ యెత్తినది. ద్విజన్మ యగుటచే బ్రహ్మత్వము వచ్చినది. యిక మాకు వేగియే లేదు. ఈ దీర్ఘ విశ్రాంతికి అభిమానులు మన్నింతురు గాక! ఎప్పటివలెనే మేము జమీందారీ రైతుల దుర్భర దుస్థితిని గడవం బెట్టునదైవ సహాయముతో ప్రయత్నించుచు మాతృభూమియొక్క స్వచ్ఛమయ జాతీయ భావములకు నూ యోవిన భంగి సేవ గావించుచుందుము.

మొదట మేము యేకాకులము. యిప్పుడన్ననో వివిధ ముఖములందు జమీందారీ రైతు సోదరులు ప్రశంసనీయ జాగరణము బొంది విముక్తినొంద యత్నించుచున్నారు. అందుచే ఆంధ్రదేశమంతయు మాకు అండ, రాష్ట్రమున కంతయు ఒక పత్రికయగు మాకు యిక అర్థిక బాధ లెటులుండగలవు? పురోగాములగు తిరుత్తని వారు మాలో యేకీభవించెదరని విశ్వాసముతో నమ్ముచున్నాము. సర్వేశ్వరుడు మా యత్నమునకు తోడ్పడుగాక!

## భగ్నయాత్ర.

ఎవరు హేతుభూతులైననేమి భగ్నమైనది గదా గాంధి మహాత్ముని లండను రాజకీయ యాత్ర! కృశీభూతాంగుడయ్యు దివ్యశక్తి మిన్నులవరకు వ్యాపింప జేసుకొన్న యీ ఋషిని మోసికొని బోవు భాగ్యము కొరకు నోములు నోచిన 'ముల్తాను' స్టీమరుకు మొక్కడ దక్కును? బొంబాయి నౌకాశ్రయము నాడు కృష్ణ భగవానుడు రాయబారిగ వెడలు సన్నాహము గావింపబడిన ఆమంత్రిణ సత్కారముల మరిపింప దలచినది. లోకోత్తర పురుషుడని వివిధ దేశముల వారిచేతను సమస్త మతములవారి చేతను సంపూజనములు గావింపబడుచున్న గాంధీజీని తన గర్భమున నిడుకొని శాశ్వతానంత చారిత్రిక కీర్తితో సంతోష గాంభీర్యములతో మహా సముద్రముల చీల్చుకొని మనుజులు నురువని తనకు జన్మ సాఫల్యమగు యానమును గావింపదలచుకొన్నది పాపము! ముల్తాను. రాముని కొరకు శబరి వలె ప్రతీక్షించి ప్రతీక్షించి లండను అతిథి విషణ్ణ హృదయమై పోయినది. ఆకేయ బ్రిటీషు సామ్రాజ్యము గాంధీజీకి ప్రతిపక్షమై సంపాదించుకొనిన ఖ్యాతికే పారితోషికముగ యీ స్వల్పాపహారిని అదరించి లోక మన్ననబడయ లేక పోవుట క్రైస్తవ నాగరికతకు అవతంసమగు బ్రిటనుకు కేవలము దురదృష్టము. ఎవరేమనుకొన్ననేమి విధి బలియముగదా! మహామహులు సివిలియనుల అయిష్టమే మాట దక్కించుకొన్నది.

దీని ఫలితము దారుణమగునని మేము చాలా భీతినొందుచున్నాము. ఇండియన్ సోషల్ రిఫార్మర్ వారన్నట్లు ఇక గాంధిజీ రెండవ లండను సమావేశమున చేయ గలిగినది యేదియు లేదు. సూత్రములన్నియు నిర్ణయింపబడినవి. వివరముల పూర్తిచేయుటకు ఉపసంఘములు నియమింపబడి తమ తమ కృషుల పరిపూర్తి గావించినవి. అందుచే యిక జరుగవలసిన కార్య కలాపము సభలో వీటినన్నిటి నామోదించుటయే. ఇప్పుడు బయటబడ్డ సంగతులు, వాటి ఫలితములు మితవాదులకు గూడ తృప్తిని గూర్చనివిగా స్ఫురించుచున్నవి. నిన్ననే స్వదేశమును జేరిన జిన్నా అనుదినము భారతదేశము పట్ల ఇంగ్లాండులో విరోధభావము [illegible]పోవుచున్నదని నుడివిరి. చర్చిలు ప్రభృతులు తెలిపిలేకయే ఝంఖారవములు గావించుచున్నారు. అందరు ఇర్విన్లుండగలరా? కావున ఇండియా ప్రభుత్వమువారి సద్భావనము, బ్రిటీషు క్యాబినెట్ వారి స్వాతంత్ర్య ప్రియతలు అండగా వున్నను ఆశతోపోయిన భారతీయ రాజకీయ యాత్రికులకు స్వాతంత్ర్య దేవతా దర్శనము గాకయే భగ్నాశయులై హృదయభారములతో స్వతీరములలో మరల పడవ దిగుదురేమోయని చింతించుచున్నాము.

ఇంతవరకు పరిస్థితులేమియు చెడలేదు. ఢిల్లీ ఒడంబడిక పూర్వ గౌరవముతోనే నిలిచియున్నది, కావున కాంగ్రెసువారు అరాచకోద్యమములకు దిగరని భావించుచున్నాము; యిక ఒడంబడిక భంగమునకు ప్రభుత్వమె కారకులగుదురో అది చరిత్రలో ఘోరతరాంశము కాగలదు. నేడు అన్ని దేశములయందు ప్రబలియున్న వివిధ విధములగు అశాంతి అరాచకములకు దోడు భారత దేశమున స్వాతంత్ర్య వాంఛతో రేగిన యీ మంట ప్రపంచమునంతయు కాల్చివేయగలదు. దేవుడు యీ గండమును తప్పించుగాక! రాజనీతికి పేర్వడ్డ బ్రిటీషువారు సమయోచితముగ యీ స్వల్ప సమస్యా పరిష్కారమును గావింప జాలరని మేము నమ్మజాలము. ఉపయోగమున్నను లేకపోయినను గాంధిని లండనకు తీసుకొనిపోయినచో ఒక గొప్ప ప్రభుత్వముతో సంధిచేసుకొనిన కాంగ్రెసు సంస్థయొక్క అంగీకారముద్రను లండను సభా తీర్మానములు పొందినవగును.

మాటలో మాట, రంగస్వామయ్యంగారు మాత్రం లండను వెడలుట చాలా అసహ్యకరము. కాంగ్రెసుపై సానుభూతి కలిగిన మాలవియా, శేఠ్, పటాణి మొదలగు వారే గాంధీమహాత్మునితో గూడ విరమించుకొనగ, కాంగ్రెసు మెదడు అని బడాయి కొట్టుకొను అయ్యవజాతి నాయకుడు అయ్యంగారు నీతి వదలిరన్న మనవులకు కష్టముగా నున్నది. కాంగ్రెసు వాడుగా తన్ను ఆహ్వానింపలేదని అసూయచేతమో, నిరాకరించిన వారి స్థితికూడ యిట్టిదేగదా. యే గాలికి ఆ చాపయెత్తుట, నైతిక సూత్రాలకు బంధింపబడకుండుట నేటి పత్రికల వలెనే నేతలకు కూడా సహజములు కాబోలు!

— —

# ఇదేనా ఆయుధ విసర్జనము?

## బ్రిటను ఒక్కటే విషవాయువు పరిశోధనలకుగా సాలుకు 1,70,000 పౌ. వ్రయించుచున్నది!

పార్లమెంటు సభ్యుడు-కమాండరు కెన్‌వర్దిగారు.

ప్రపంచ నాగరిక జాతులు సాలుకు 900,000,000 పౌన్లు ఆయుధములకు వెచ్చించుచున్నవి. యుద్ధానికి ముందు బ్రిటిషు దేశము సంవత్సరానికి యుద్ధసన్నాహానికి 60,000,000 పౌనులు ఖర్చుపెట్టి యిప్పుడు 111,000,000 పౌనుల ఖర్చు పెట్టుచున్నది. గత యుద్ధంలో 10,000,000 చనిపోయిరి; 20,000,000 క్షతగాత్రులైరి. 9,000,000 శిశువులు అనాధలైరి. 5,000,000 స్త్రీలు విధవలైరి.

స్వాతంత్ర ప్రియులగు కెన్‌వర్దిగారు "జాన్ బుల్" అను పత్రికలో యిట్లు వ్రాయుచున్నారు.

అమెరికా అధ్యక్షుడు హూవరుగారు ఋణబాధలకు కల్పించిన ఉపశమనముతో కూడ యూరపు అమెరికాల రాజకీయ పరిస్థితి గొప్ప మార్పును బొందినది. ఇట్లే సమర సన్నాహములందుగూడ ఆటవిడుపు జరుగనిచో ఇది అంతయు అవమాన పూర్ణము గాగలదు.

అమెరికా తనకు తన యుద్ధ మిత్రులు, ఫ్రాంసు, ఇటలీ, పోల్యాండు, బెల్జియం మన దేశము (ఇంగ్లండు) అచ్చవలసిన ఋణముల ప్రోసివేసిన ఆ ధనమును యీ దేశములు యుద్ధ సన్నాహములపై మందుగుండు సామానులకుగా వెచ్చించుచునని ఆ దేశీయులు వాదించుచుండెడివారు. ఈ వాదములో కొంతనిజము లేకపోలేదు.

అస్త్ర సన్యాసమును గూర్చి వేలకు వరబడి పునీతమయు వుద్రేకపూర్ణ వుపన్యాసములు గావింపబడినవి. సోదర ప్రేమను గూర్చి విరివిగ ప్రచారమును గావింపబడినది. కాని, కార్యాచరణమేది? దానికి సాధనము లేవి?.

యూరపు వినాశనపు అంచున నిలువబడియున్నది. తప్పింప శక్యముగాని జర్మనీ వినాశనము, దివాలాలు, ఇప్పటికే రూకలేకున్న ఆస్ట్రియా దుర్భర స్థితి, ఇవన్నియూ ఆర్థిక పునాదుల నరుముచేయనున్నవి. దీనికి ముఖ్యహేతువు గత యుద్ధనష్ట పరిహారములకు అమెరికాకు చెల్లించవలసిన లెక్కలేని కోట్ల ద్రవ్యము. అమెరికా సహాయపడినది. ఈ క్రూరమైన పంథమును నిరోధింప ఇకనైన మార్గము గలదా!

### ధనమువలన పుట్టిన యుద్ధము.

కృశించి, దివాలతో కంపించి పోవుచున్న యూరపు వ్రయమును పరికింపుడు. ఇందలి దేశములు యుద్ధ సామాగ్రి విమానములు, బాంబులు, విషవాయువులు తుపాకులు మొదలగు వాటికిగా ప్రతి సంవత్సరము 520,000,000 పౌనుల ఖర్చు పెట్టుచున్నవి. ప్రపంచ నాగరిక జాతులన్నియు 900,000,000 పౌనుల వెచ్చించుచున్నవి.

ఈ ధనరాసినే సత్ప్రయోగముగావించి ఉపయుక్త కార్యములకు హెచ్చించిన లోకమెంత బాగుపడగలదో యూహింపుడు. ఇకముందు యుద్ధముల నిర్మూలించుటకు ఒక యుద్ధము జరుగునని దానికిగా బ్రిటీషు ప్రజలు ఇంకనూ నిమిషమునకు 1000 పౌనుల వంతున ఖర్చు పెట్టుచున్నారు. ఇట్లే ఇక 140 సంవత్సరములు ధనమును నాశనము చేయనున్నారు.

### యుద్ధమునకు ముందు వెనుక.

గత సంగ్రామమునకు ముందు అమెరికా సంయుక్త రాష్ట్రములవారు ఆయుధములకుగా సాలుకు 92,000,000 పవునులు వెచ్చించుచుండినారు. అయితే యిప్పుడు 1?5,000,000 పవునులు ఖర్చు పెట్టుచున్నారు. 1912 లో గ్రేటుబ్రిటను ఆయుధములకుగా 60,000,000 పవునులు వెచ్చించి 1931 లో 111,000,000 పవునులు వ్రయపెట్టుచున్నది.

1924 లో రష్యా 24,000,000 పవునులు, 1931 లో 62,000,000 పవునులు ఖర్చుపెట్టుచున్నది. ఇట్లే ఫ్రాంసు దేశము 66,000,000 పవునుల, యిప్పుడు 87,000,000 పవునుల ఖర్చుపెట్టుచున్నది. అనగా లోకమును క్రమ్ముచున్న ఆర్థిక దుస్థితిని లెక్కించక, తగ్గిన ధరల లెక్కచెట్టక సమర సన్నాహపు ఖర్చును పెంచుచున్నారు.

ఇక ఏడేండ్ల లోపల అమెరికా యుద్ధ నావలకుగా 200,000,000 పౌండ్ల వెచ్చింప సంకల్పించుకొన్నది. ప్రతిదేశ ఆదాయమునందు లోటు గన్పించుచు, పనిలేనివారి సంఖ్య మితిమీరి పెరిగి పోవుచున్న యీ దినాలలో ఎప్పుడో యుద్ధమని యిప్పుడు ఎట్లు ధనమును నాశనము చేయుచున్నారు!

### ఘోరదుష్ఫలము.

మరియు గత సంగ్రామపు ఘోర వ్యాధయ విదారిత ఫలితములుగూడ పేరి ప్రయత్నము ఆవంతయు అరికట్టజాల కున్నది. గత యుద్ధంలో 10,000,000 పురుషులు చనిపోయిరి. 20,000,000 మంది వికలాంగులైరి. 9,000000 శిశువులు నిలువ నీడ లేక పోయిరి. 5000000 స్త్రీలు విధవలైరి. యుద్ధ నిర్మూలనమునకై గావించిన యుద్ధమునకు ఇవి శాశ్వత సచేతన స్మారకములుగావా?

సంధి జరిగిన గత 12 ఏండ్లుగా ఆయుధ విసర్జనమునుగూర్చి మాట్లాడుచు నేయున్నాము. సభల జరుపుచునే యున్నాము. ఇంకను రాబోవు ఫిబ్రవరిలో దీనికిగా జనీవాలో గొప్ప సభ జరుగనున్నది. వట్టి మాటల చాలించి నిజముగ ఆయుధముల తగ్గించు నదుపాయముల అరయనిచో ఘోర ప్రళయము మనల ముంచి వేయగలదు.

భయము - భయంకర స్వభావము.

ఆయుధములు ఒక దేశము తన ప్రక్క దేశమునకు భయపడుట అను మానసిక రుగ్మతకు చిహ్నములు. ఇప్పటి ఆయుధము లే కూరతమములైనను వీటికి మాత్రమే హద్దు లేర్పరచుట సులభ సాధ్యములు. ఇప్పుడు ఒక వేళ సంపూర్ణముగ ఆయుధ విసర్జనములు జరిగినను క్రిమేణా మరికొన్ని యేండ్లలో యుద్ధములు జరుగును. ఎట్లన వారి వారి వ్యాపారక విమానములు, స్టీమరులలో ఆయుధ ప్రయోగములకు వీలు గల్పించి యుందురు. కాని యివి చాల క్షుద్రమైనవిగను పనికిరానివిగను వుండగలవు. ఇప్పటి స్థితికి అన్నియు రావలయుననిన చాలకాలము పట్టును.

విషవాయు పరిశోధనలు.

సంధిప్రకారం విషవాయువులు నిషేధింపబడినను, ప్రతిదేశము కొన్ని ఘోరతమవిషవాయువుల దాచియుంచుకొనివాటి ప్రయోగముల నలవరచుకొనుచు పరిశోధనల గావించుచున్నది. బ్రిటీషు వారమగు మనము శ్యాలిస్‌బరి సమీపమున పోర్టన్ నందు ఒక భారివిష వాయుపరిశోధనాలయమును నెలకొల్పియున్నాము. ఈ సంవత్సరము గుర్రములు, పిల్లులు, మేకలు మొదలగు వాటిమీదనే గాక మానవోపాయములచే యువకులనుగూడ లోబరచుకొని వారికి ముసుగులు వేసి ప్రాణాపాయములగూర్చి వాయువుల పరిశోధించుటకుగాను 170000 పౌనుల వెచ్చించుచున్నాము. ఉత్సాహ వంతులగు యువకులయిట్లు వుపయోగించుట ఎంత హేయము! కావలెనను కొన్న దేశములన్నియు యీ దారుణముల తుదముట్టింపగలవు. ...షవాయువులు వుపయోగింపకూడక ...గరి యీ ప్రయత్నము లేల?

జలాంతర్గాములు ముఖ్యముగ వ్యాపార నౌకలకు చాల నాశనకారి. దీని స్వభావముచేతనే పడవలముంచి నాశము జేయును గాని తన స్వంత వుపయోగమునకైనను సరకుల రేవు చేర్చజాలదు. యుద్ధానంతరము యీ శాంతి దినాలలో జలాంతర్గాములకు కలిగిన అపాయములవలన మనము 200 పైన బ్రిటీషునావికుల గోల్పోయినాము. అమెరికా, ఫ్రాన్సు, ఇటలీ, జపానుల చరిత్రలుగూడ ఇట్టే రక్తకళంకితములై యున్నవి. అందరు అనుకొనిన వీటిని నిలిపి వేయవచ్చును. ఇందు శిక్షణమునకు రెండేండ్లు పట్టును.

నిన్న మొన్న బ్రిటీషువారు నిర్మించిన నెల్‌సన్, రాడ్‌నీ అను యుద్ధనావలకు ఒక్కొక్క దానికి 7,000,000 పౌనులు పట్టినది. యిక ఒక్కొక్క దానికి సాలుకు ఖర్చు 2750000 పౌనులు పట్టును. యిక బాంబులు వేయు విమానములను ఆత్మ రక్షణ సాధనము లనుట అవివేకము. అవి శత్రువులపై ప్రయోగమునకై పనికివచ్చును. అనగా నిరపాయులు భయ విహ్వలులు యుద్ధవాసనలెరుంగని యుద్ధహేతు భూతులు కాని నగరవాసులగు స్త్రీ పురుషుల శిశువుల సంఘాత మరణములకే యివి పనికి వచ్చుచున్నవి. అందువలన పెద్ద విమానములకు యిక ముందు యుద్ధములందు చోటే యుండరాదు. యిట్లు ఆయుధ విసర్జనము గావించినచో మానవజాతి మరల స్వేచ్ఛావాయువుల పీల్చుకొనగలరు. ఋణబాధలు వుదారముగ పరిష్కరింపబడగలవు. వివిధ దేశ కోశాధిపతుల ముఖములు మందస్మితములలో విరాజిల్లగలవు.

నేను యిప్పుడు అన్ని ఆయుధములందు ఘోరమైనటువంటిన్ని వ్యయమూలమైనటువంటిన్ని పెద్దవాటిని నిర్మూలించమని ఆయుధ విసర్జన సమస్యకు చాలా లాభకరమైన ఆచరణ యోగ్యమైన సలహాల నిచ్చియున్నాను. అటు వివిధ దేశములు గావింపనిచో మరల కనివిని యెరుగని ఘోర సంగ్రామము సంక్రమించును. దాని ఫలితముగ జనించిన విప్లవములచే దేశములు జర్జరము లైపోవును. ప్రజ ఆకటదప్పులచే కృశించి జీర్ణించి మృత్యువాత బడుదురు.

---

# ఎస్టేట్సు ల్యాండు ఆక్టు సవరణ బిల్లు.

శాసన సభ్యులయిన జమీన్దార్లు తమ ధర్మముల నెరవేర్చిరా?

(శ్రీయుత వి. అల్లాస్వామయ్యర్ గారు, బి. ఏ.,)

రైతుల స్థితిని చక్కబరచుటకును, తమ జామీను భూములకు తామే సర్వాధికారులమను భ్రమను జమీన్దారుల మనస్సులనుండి పోగొట్టుటకును ప్రభుత్వము వారు చాల శాసనముల గావించిరి. వాటిలో చివరది 1908 సంవత్సరపు మొదటి ఆక్టు. ఇది రైతు దుస్థితిని కొంత వారించినను అమలులోనికివచ్చిన అనతికాలములోనే చట్టము లోపభూయిష్టమని కనుకొనబడి 1913 లో సవరణ బిల్లు ప్రతిపాదనకు కొనిరాబడినది. ఈ బిల్లుల పరిశీలనమునకు రెండు కమిటీలు ప్రభుత్వముచే నియమింపబడినను, యీ కమిటీలు సమావేశమైనట్లుగాని, నివేదికల పంపినట్లు గాని దెలియకున్నది. కంపెని వారినుండి మహారాణి 1857 లో భారత రాజ్యము తీసికొనినది మొదలు యింతవరకును, జమీందారుల మధ్య రైతుల మధ్యగల యదార్థ పరస్పర సంబంధమును నిర్ణయించ ఏర్పరుపబడిన యిట్టి కమిటీలకు, అధికారము సాగుచున్న జమీందార్లు పలుకుబడిగల పాలెగాండ్లు తీవ్ర ప్రతిబంధకములను సదా కలిగించుచునేయున్నారు. రైతు స్థితిని బాగు చేయ దలచుకొన్న యీ బిల్లుల బుట్టదాఖలా జేయించుట యందు పలుకుబడిగల జమీందార్లు సఫలీకృత మనోరథులైరనిన పొరపాటు గానేరదు.

జమీన్దారు రైతు అభివృద్ధిని గూర్చునట్లు ఒక నిబంధన వుండవలెను.

1908 సం॥పు చట్టము రైతుకు సర్కారంటు ఆక్యుపెన్సీ హక్కును గూర్చి జమీన్దారు గూడ తనతోడి స్వంతదారు అను భావము రైతుకు కలిగించినను ఆ చట్టమున సవరింపబడవలసిన అంశములు చాల గలవు. ఇందు రైతు యోగ క్షేమ

(8-వ పుట చూడుము.)

## వెంకటగిరిలో జమీందారీ రైతుల సభలు.

(ఒక విలేఖరి.)

వెంకటగిరిలో ఆగస్టు నెల తే 1 దిన జమీందారీ రైతులు సమావేశమైరి. సూళ్లూరుపేట, నాయుడుపేట, ప్రాంతములనుండియుగూడ పలువురు వచ్చిరి. వెంకటగిరి డివిజనునుండి సుమారు 300 మంది రైతులు విచ్చేసిరి. జమీందారీ రైతు సభలంటె తొంగిచూచినైన యెరుగని ముప్పాళ్ళ సుబ్బరాఘవరెడ్డి, కళత్తూరి వీరాస్వామిరెడ్డిగారలు గూడ వచ్చిరి. వీరు జమీందారీ రైతులుగను, జిల్లాబోర్డు సభ్యులుగను వున్నారు. నెల్లూరుజిల్లా జమీందారీ రైతు సంఘ కార్యనిర్వాహక సభ్యులుగూడ విచ్చేసిరి. ఇచ్చట సమావేశమైన రైతుల ఉత్సాహము వర్ణనాతీతముగా నుండినది. చిత్తూరు జిల్లాలో వెంకటగిరి జమీందారు గారికి సంబంధించిన ముద్దిలి గ్రామవాస్తవ్యులు గూడ [..]వము, తమ కష్టముల నర్జీల మూలమున [..]సుకొని వచ్చిరి. వంగోలు తాలూకా [..]ముక్కాల గ్రామ రైతుల ప్రతినిధిగారు [..]డ విచ్చేసిరి.

### ఆహ్వాన సంఘము నేర్పరచుట.

రైతు లందరును చేరి నెల్లూరు జిల్లా జమీందారీ రైతుల కాన్ఫరెన్సుకును, ఆంధ్రరాష్ట్ర జమీందారీ రైతుల కాన్ఫరెన్సుకును, ఆహ్వానసంఘము నేర్పరచిరి. సుమారు 100 మందికి పైన ఆహ్వానసంఘ సభ్యులుగా చేరిరి.

### ఆహ్వానసంఘ సమావేశము.

పిదప ఆహ్వాన సంఘమువారు సమావేశమై యీక్రింది తీర్మానములు చేసిరి. జిల్లా కాన్ఫరెన్సుకు, ఆహ్వానసంఘాధ్యక్షులు శ్రీయుత బద్దిపూడి వెంకటనారాయణ రెడ్డి గారిని, అధ్యక్షులు జమీందారీ రైతుల పాలిటి కల్పతరువగు విశ్వనాథ నాక్ మహాశయో గారిని యెన్నుకొనిరి. ఆంధ్రరాష్ట్రజమీందారీ రైతులకాన్ఫరెన్సుకు ఆహ్వాన సంఘాధ్యక్షులు, వెంకటగిరి అసెంబ్లీ సభ్యులగు, బి. పెరుమాళ్ల నాయుడు గారిని, అధ్యక్షులు ప్రొఫెసర్ నోగినేని రంగనాయకులు గారిని యెన్నుకొనిరి. కార్యదర్శులు, కటికనేని కల్యాణరావు గారు ప్రభృతులను యెన్నుకొనిరి. ఆహ్వాన సంఘ రుసుము రు 2 లు గా తీర్మానించిరి.

### కమిటీ మీటింగు.

నెల్లూరు జిల్లా జమీందారీ రైతు సంఘ కార్యనిర్వాహక సమావేశము గూడ జరిగినది. కమిటీ సభ్యులేగాక పలువురు ముఖ్య జమీందారీ రైతులు గూడ ప్రేక్షకులుగా నుండిరి. కమిటీ వారి ప్రత్యేకాహ్వానముపై రావు బహదూర్ అమంచర్ల కృష్ణరావు పంతులుగారును, బి. అన్నాస్వామయ్యరుగారును గూడ విచ్చేసి కార్యక్రమమును పరికించుచుండిరి. ఈ కమిటీ వారి తీర్మానముల వేరొకచోట ప్రకటింపబడినవి.

### రాత్రి బహిరంగ సభ

ఆగష్టు 1 తేది రాత్రి 8½ గంటలకు గాంధి మైదానములో బహిరంగసభ జరిగినది. ఈసభకు శ్రీయుతులు మేనకూరు శీతా రామిరెడ్డిగారు అగ్రాసనాధిపత్యము వహించిరి. ప్రథమమున నెల్లూరు వెంకట్రామానాయుడుచే ప్రార్థన గానింపబడిన తర్వాత "మాకొద్దు జమీందార్ల పొందు" అను గేయమును పాడిరి. ఈపాటతోడ రైతులలో పూర్తి సంచలనము ప్రారంభ మైనది. పిమ్మట, ప్రొఫెసర్ రంగనాయకులు గారు, రాజకీయ పరిస్థితులను గురించి ఉపన్యసించిరి. జమీందారీ రైతుల విచారణ జరుపుచున్నందున దానిని గూర్చి ప్రస్తుతము విపులముగా చర్చింపజాలమని వారికీకష్టముల గూర్చి దిఙ్మాత్రముగా సూచించిరి. తర్వాత, బి. పెరుమాళ్ళనాయుడుగారు జమీందారీ రైతుల కష్టములగూర్చి సంక్షేపముగా ఉపన్యసించిరి. తదుపరి వెన్నెలకంటి అప్పారావుగారు జమీందారీ రైతులకును, రైత్వారీ రైతులకునుగల భేదమునుగూర్చియు, జమీందారీ రైతుల అధిక పన్నులగూర్చియు విపులముగా ఉపన్యసింప మొదలిడిరి. మధ్యలో కొందరు ప్రతిపక్షులు తాముగూడ మాట్లాడుటకు అవకాశ మివ్వవలెననియు కొంత గలభా చేయ మొదలిడిరి. ప్రెసిడెంటుగారు అంతట యితరులు మాట్లాడి అనవసరకక్షలు పెరుగుననెడి మొదలగు సంగతులు చెప్పి సమాధాన పరుప నెంచిరి. యెదుట పక్షమువారు కొంత గలభా చేయ మొదలిడిరి. వీరిలో శ్రీ కుమారరాజాగారి సాన్నిధ్య గుమాస్తా సి. గోపాలుగారును, వీరి తమ్ములు ముఖ్యులుగా నుండిరి. మఱియొక స్థానోద్యోగి జూపల్లి వెంకట్రామారావుగారుగూడ ప్రక్కనే నిలిచి చూచుచుండిరి. అంతట అనవసర కలహముల కవకాశమివ్వక ప్రెసిడెంటుగారు సభ ను తక్షణమే నిలిపివేసిరి. జమీందారుగారు యీలాంటి విషయములలో తమకు సంబంధించిన ఉద్యోగులకు అనవసర జోక్యము కలుగజేసి తమకు నిందను రాకుండ చేసుకొనుట ధర్మము.

### రంగనాయకులు విచారణ సంఘము.

పై సంఘాధ్యక్షులగు ప్రొఫెసర్ రంగనాయకులుగారును, సభ్యులు మేనకూరి శీతారామిరెడ్డిగారు, బి. పెరుమాళ్లనాయుడుగారును ఆ రోజు ఉదయము గ్రామస్థుల ఆహ్వానముపై చాపలపల్లె గ్రామమునకు పోయి వచ్చిరి. తర్వాత చుట్టు ప్రక్కల చాల గ్రామములనుండివచ్చిన రైతులవల్ల సాక్ష్యము పుచ్చుకొనిరి. జమీందారులకె హడలిపోవుచుండు రైతులు యింతమంది ధైర్యముగా తమ కష్టముల నివారించుకొనుటకు సమావేశమగుట నూతన భావాంకురములు రైతుల హృదయములలో జొచ్చెననుటకు ప్రబల నిదర్శనము.

---

(6 వ పుట, 3 వ కాలము తర్వాత.)

ముల బాధ్యత జమీన్దారుకు లేనట్లు సర్వ సాధారణముగ స్ఫురించుచున్నది. వివిధ విషయములందును రైతు స్థితిని సుస్థిరముగను, అభివృద్ధిదాయకముగను చేయుటకు యీ చట్టమున అవకాశములు కల్పింపబడవలయును. ముఖ్యముగా జమీన్దారు తన వరుంబడిలో కొంత భాగము రైతుల వ్యావహారిక, విద్యా విషయక, ఆర్థిక, సాంఘిక, ఆరోగ్యాభివృద్ధులకుగా ఖర్చు చేయవలసినట్లు ఒక నిబంధన యుంచవలయును. ఈ విషయమును సుప్రసిద్ధ ఆంధ్రదేశ భక్తులు, గొప్ప భూస్వామి పేరుపొందిన న్యాయవాది శ్రీ న్యాపతి సుబ్బారావు పంతులుగారు 52 మ. లా. జర్నలునందు చాలా విపులముగా విశదీకరించియున్నారు.

### జమీన్దార్లు తమ ధర్మముల నెరవేర్చిరా?

ఈ విషయము లన్నిటిని గమనించిన యీ మధ్య సమావేశమైన శాసనసభలోనికి యీ సవరణ చట్టమును గొనివచ్చుటలో ప్రభుత్వము ఉచిత కర్మమును గావించి యుండలేదు. సామాన్య నియోజక వర్గములనుండి అసాధారణ సంఖ్యతో జమీందారులు శాసన సభకు ఎన్నుకోబడిరి. కావున సమయము కాదని ప్రభుత్వము బిల్లును ఉపసంహరించు కొనినదా? ఇట్లు సామాన్య నియోజక వర్గము గుండా సభలో ప్రవేశించిన జమీందార్లు యీ విషయమున ఏమిచేసిరో నే నడుగవచ్చునా? సవరణ చట్టముపై వారివారి అభిప్రాయముల నేల తెలుపలేదు? త్వరలో అట్లు చేసి రైతులు తమ కష్ట నిష్ఠురముల దెలుపుకొనుటకు అవకాశముల కల్పించెదరని వూహించుచున్నాను.

బిల్లును గూర్చిన విపులమైన విమర్శనము ముందు వ్రాసెదను.

---

ఆంధ్రరాష్ట్రీయ జమీందారీ రైతు మహాసభ,
నెల్లూరుజిల్లా జమీందారీ రైతు మహాసభ,

## వేంకటగిరిలో

### సెప్టెంబరు 8, 9 తేదులలో జరుగును.

రాష్ట్రీయ సభాధ్యక్షులు:- ప్రొఫెసరు రంగనాయకులుగారు.
ఆ. సంఘాధ్యక్షులు:-బి. పెరుమాళ్లునాయుడుగారు.
జిల్లాసభాధ్యక్షులు:- విశ్వనాథదాస్ మహాశయా.
ఆ. సంఘాధ్యక్షులు:-బద్దెపూడి వేంకటనారాయణరెడ్డిగారు.
ప్రారంభోత్సవము
వంగ యువనాయకులు బాబు సుభాషచంద్రబోసుగారు
జరిపెదరు.

## తిరుత్తని రైతుల కష్టములు వీడ నుండుట.

### జమీన్ రైతు సంఘకోర్కెల మహంతు సమాలోచించుట.

(ఒక విలేఖరి.)

గత పదెనిమిది మాసములనుండియు, నీ యూరిలోని జమీన్ రైతుమహాజన సంఘమువారు చేయుచుండు ప్రచారము కొంకించుక ఫలితముగా, నిన్నటి దినము ఉదకమండలమునందుండు తిరుమల తిరుపతి దేవస్థానము ఎస్టేట్ల విచారణకర్తలగు శ్రీ మహంతు ప్రయాగదాసుజీవారివద్దనుండి జమీన్ రైతు మహాజన సంఘకార్యదర్శిగారి కొక యుత్తరము వచ్చినది. ఆ యుత్తరములో జమీన్ రైతు మహాజనసంఘ సాధారణ అవసరమహాసభల వృత్తాంతములను, ఉపన్యాసములను, తీర్మానములను సాంతముగా జూచుచున్నామనియు, రైతాంగముయొక్క కష్టములను సానుభూతితో విచారించి మేల్గనతికాలములోనె గల్పింతుమనియు, వ్రాసియుండిరి. అంతమాత్రమే గాకుండ సంఘమువారి తీర్మానముల ననుసరించి 1341 ఫసలినుండి పచ్చిమెుక్కల వసూలుగింపబడునీలి, జనుము, వెంపలి వగైరా పైర్లమీద భూములకు తీర్వాలు ఛార్జిచేయుట లేదనియు, నేటి న్యాయాధికారు శ్రీయుత శంగవాముల గామారావుగారి ద్వారా హుకుములు జారీచేయించిరని కూడ రూఢిగా తెలియుచున్నది.

## వార్తావాహిని.

**రంగనాయకులు ఆర్థిక విచారణ సంఘము**

పై సంఘమువారు తిరుగా సెప్టెంబరు నెలలో విచారణ ప్రారంభింతురు. రంగనాయకులుగారు అనారోగ్యంగా వున్నందున యీ నెలలో విచారణ ఆగిపోయినది.

◆ ◆ ◆

ఆంధ్ర కాంగ్రెసు కమిటీకి నెల్లూరు విచ్చేసి నాయకులలో కొందరు యీ జిల్లాలో సంచారము చేతురు. జమీందారీ గ్రామములుగూడా జూతురు. వెంకటగిరిగూడా దర్శించి ఉపన్యాసము లిత్తురు.

◆ ◆ ◆

ఆంధ్ర జమీందారీ రైతుసంఘ కార్యదర్శులును, గోదావరి, కృష్ణజిల్లాల కెపిటల్ మెంటు విషయమున పనిజేయు వారిలో నొకరగు కల్యాణప్రగడ మందేశ్వర శర్మగారు కొన్ని జమీందారీ గ్రామములును, కొన్ని గవర్న మెంటు గ్రామాదులును, సంచారమొనర్చి, "జమీందారీ రైతుల దుస్థితిని" గూర్చియు, "కేపిటల్ మెంటును" గూర్చియు, "రాండుకేపిటల్-రైతు" అను విషయములను గూర్చియు ఉపన్యసించుతును.

◆ ◆ ◆

వెంకటగిరిలో జరుగు జమీందారీ రైతుల కాన్ఫరెన్సు పనులు చురుకుగా జరుగుచున్నవి. సభలకు 2000 మంది కూర్చొనుటకు వీలగునటుల ప్రత్యేక పందిరి నిర్మింపబడుచున్నది.

సంపాదకుడు, ప్రకాశకుడు:— నెల్లూరు వెంకట్రామానాయుడు; రామకృష్ణ ముద్రాక్షరశాలలో వన్నెపల్లి రామకృష్ణరావుగారిచే ముద్రితము, నెల్లూరు.